
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 । కనిష్ఠం 20.4
ఆంధ్రజ్యోతి
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 19 సెప్టెంబరు 2024




వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 18: కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆయా విభాగాలకు సీనియర్ రెసిడెన్స్ ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. అటానమి, బయోకెమిస్ట్రీ, ఫీషలోజి, మైక్రోబయోలజీ, ఫార్మకోలోజి, ఎస్‌పీఎం, ఫేరెన్సి, మెడిసిన్, ఈఎన్‌టీ, ఆప్టికల్ మైలోజి, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఓటీజీ, పీడీయాటరిస్, రెస్పిక్టరి మెడిసిన్, అనేస్థిషియా, రెడియాలజీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, పీజీ డిగ్రీ సీనియర్ రెసిడెంట్ పోస్టుక్వాలిపై 50శాతం మార్కులు సాధించాలన్నారు.

దిగుబడులపై ఆశలు

- జిల్లాలో విస్తారంగా వరి సాగు చేస్తున్న రైతులు
- 3.11 లక్షల ఎకరాల్లో వరి సాగు
- విస్తారంగా కురిసిన వర్షాలు.. పెరిగిన భూగర్భ జలాలు
- వరితో పాటు సోయా, మొక్కజొన్న వేల ఎకరాల్లోనే సాగు
- జిల్లా వ్యాప్తంగా 5.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు
- వరి 6.35లక్షల మెట్రిక్ టన్నుల్లో వరి దిగుబడులు వచ్చే అవకాశం



జిల్లాలో సాగవుతున్న వరి పంట

కామారెడ్డి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వర్షాకాలం సీజన్‌లో వరి రికార్డు స్థాయిలోనే సాగైంది. వరి విస్తారంగా సాగవడంతో దిగుబడులపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం సాగైన వరిని బట్టిచూస్తే 6.35 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అధికారులు నిర్ధారించిన విధంగానే వరి విస్తారంగా సాగైంది. సాధారణం కంటే ఎక్కువే ఈ యేడు వరి సాగు అయినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 3.11 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నీటి లభ్యత ఎక్కువగా ఉండడంతో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వరితో పాటు పత్తి, మొక్కజొన్న, సోయాబిన్ పంటల సాగు విస్తీర్ణం సైతం పెరిగింది. సీజన్ మొదటి నుంచి విస్తారంగా వర్షాలు కురువడం, భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో వరి సాగు పెరిగినట్లు సంబంధితశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 5.47 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు సాధారణ పంటల సాగుకంటే అదనంగా పంట సాగు పెరిగింది. జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 5,47,854 ఎకరాల్లో వివిధ పంటల్లో సాగు అవుతాయని అంచనా వేశారు. ఈ సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురవడంతో సాధారణం కంటే సాగు విస్తీర్ణం పెరిగింది. సోయాబీన్ పంట 85,447 ఎకరాల్లో పంటలు సాగు అవ్వాల్సి ఉండగా 92,135 ఎకరాల్లో సాగు అయ్యాయి. పత్తి 28,730 ఎకరాల్లో సాగు అవాల్సి ఉండగా 33,395 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 57,315 ఎకరాల్లో సాగు అవ్వాల్సి ఉండగా 44,601 ఎకరాల్లో సాగు చేశారు. వరి 3,13,965 ఎకరాల్లో సాగు అవాల్సి ఉండగా 3,11,738 ఎకరాల్లో సాగు చేశారు. కందులు 13,961 ఎకరాల్లో సాగవాల్సి ఉండగా 55,218 ఎకరాల్లో సాగయింది. పెసర్లు 4,997 ఎకరాల్లో సాగు అవాల్సి ఉండగా 4,596 ఎకరాల్లో సాగైంది. మినుములు 5,263 ఎకరాల్లో సాగవాల్సి ఉండా 4,812 ఎకరాల్లో సాగయింది. జొన్నలు 577 ఎకరాలకు గాను 40 ఎకరాలలో, చెరుకు 2,215 ఎకరాలకు గాను 673 ఎకరాల్లో సాగయ్యాయి.

పెరిగిన వరి సాగు విస్తీర్ణం

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో ఈ వర్షాకాల సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ఈ వానాకాలం సీజన్ లో జిల్లా వ్యాప్తంగా 3,13,965 ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. మాచారెడ్డి, రామారెడ్డి, లింగంపేట్, గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, బిచ్కుంద, కామారెడ్డి మండలాల్లో ప్రతీఏటా వరి పంటను విస్తారంగా సాగు చేస్తుంటారు. ఈ వానాకాలం సీజన్ లోనూ విస్తారంగా వర్షాలు కురవడంతో వరి నాట్లు జోరుగా పడ్డాయి. లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్ మండలాల్లో వరి పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,11,738 ఎకరాల్లో వరి సాగైంది. విస్తారంగా వర్షాలు కురువడం, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడం, భూగర్భ జలాలు సైతం వృద్ధి చెందడంతో సాగు విస్తీర్ణం పెరిగినట్లు తెలుస్తోంది.

6.35 లక్షల మెట్రిక్ టన్నుల్లో వరి దిగుబడులు వచ్చే అవకాశం

జిల్లాలో ఈ యేడు వరి సాగు విస్తీర్ణం అంచనాలకు మించి పెరిగిపోయింది. దొడ్డు రకంతో పాటు సన్నాల వరి సాగు సైతం పెరిగింది. విస్తారంగా వర్షాలు కురువడం, నీటి లభ్యత ఉండడంతో ప్రస్తుతం సాగవుతున్న వరికి ఎలాంటి తెగుళ్ల లేకుండా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అకాల వర్షాలు కురువకుండా ఉంటే కోతల సమయంలో మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగైన 3.11లక్షల ఎకరాల వరి సాగుకు సుమారు 6.35లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో నెల రోజులు అయితే వరి కోతలు సైతం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు జిల్లా అధికారులు సైతం సిద్ధమవుతున్నారు.

పెరిగిన కందుల సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో కంది సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో కంది పంట సాగు విస్తారంగా పెరిగింది. మార్కెట్‌లో కంది పంటకు మంచి ధర రావడంతో రైతులు ఆ పంట సాగువైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాలం సీజన్‌లో కంది పంటసాగు 13,961 ఎకరాలు సాధారణ సాగు కాగా ప్రస్తుతం 55,218 ఎకరాల్లో పంట సాగైంది. అంటే సుమారు 30 శాతం అదనంగా పంట సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, డోంగ్లి, పిట్లం, గాంధారి, సదాశివనగర్, రాజంపేట తదితర మండలాల్లో కంది పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు.

సమ్మె బాటలో.. ఆరోగ్యమిత్రలు

- ఆసుపత్రుల్లో నిలిచిన సేవలు
- డిమాండ్ల సాధన కోసం పోరుబాట
- ట్రస్టు కార్యాలయం ముందు ధర్నా
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 18: తమ సమస్యలు తీర్చడంతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కామారెడ్డి జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆరోగ్యమిత్రలు సమ్మెబాట పట్టారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయం ముందు నిరవధిక దీక్షకు దిగారు. దీంతో కామారెడ్డి జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం ఏర్పడింది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకుండా తమతో వెట్టి చాకిరి చేయించుకున్నారని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆరోగ్యమిత్రలు ఆందోళన చేపట్టారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రెండు ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లాలోని 6 ఆసుపత్రుల్లో 25 మంది ఆరోగ్యమిత్రలు సేవలు అందిస్తున్నారు. వీరంతా బుధవారం నుంచి సమ్మెబాట పట్టారు.

ఆరోగ్యశ్రీ పథకంలో కీలకపాత్ర ఆరోగ్య మిత్రలదే..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలోని పేద ప్రజలకు వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందేందుకు గాను ఆయా ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రలను నియమించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే రోగులకు రిజిస్ట్రేషన్ చేయించడంతో పాటు వైద్యసేవలు ఎలా అందుతున్నాయని పరిశీలించడం, రోగులకు ఇంటికి పంపడంతో పాటు సంవత్సరం పాటు రోగుల బాగోగులు తెలుసుకునేందుకు ఆరోగ్య మిత్రలు పని చేస్తున్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

• అల్లావుద్దీన్, ఆరోగ్యమిత్ర జిల్లా సంఘం అధ్యక్షుడు

మేము ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం అయిన నాటి నుంచి ఆరోగ్యమిత్రలుగా కొనసాగుతున్నాం. ప్రారంభంలో నెలకు రూ.3500 వేతనంతో పని చేయగా ప్రస్తుత వేతనం పనికి తగిన విధంగా లేదు. గతంలో ఆరోగ్యశ్రీ సేవలు చాలా తక్కువగా ఉండేవి. అంతేగాక గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఇంకా చాలా రకాల వ్యాధులను చేర్చడంతో పనిభారం పెరిగింది. ప్రతీ విషయం ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పని గంటలు పెరిగాయి. జీవో 60 ప్రకారం పనికి తగ్గ వేతనం ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, పని గంటలు భారం తగ్గించాలి.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్

2007 సంవత్సరం ఆరోగ్యశ్రీ ప్రారంభంలో మిత్రలకు నెలకు రూ.3,500 వేతనం చెల్లించేవారు. 2012లో రూ.7,500, 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలకు వేతనాన్ని 12,000 పెంచారు. అదే ఏడాది పీఆర్‌సీ ప్రకారం 15,200 ఇవ్వగా, పీఎఫ్, ఈఎస్‌ఐ కట్ కావడంతో మిత్రలకు ప్రస్తుతం నెలకు రూ.13,300 వేతనం చేతికి అందుతోంది. వేతనం పెరిగినా ధరలకు అనుగుణంగా లేదని జీవో 60 ప్రకారం పెంచి వేతనం అందజేయాలని ఆరోగ్యమిత్రలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటుగానే ఆరోగ్యమిత్రగా ఉంటే అన్‌సిల్క్ వర్క్ కింద తమకు సరియైన వేతనం రావడం లేదని, తాము ఆన్‌లైన్‌లో ఆరోగ్యశ్రీకి సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నందున తమను డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా గుర్తించి వేతనం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తమతో వెట్టి చాకిరి చేయించుకుందని కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ సేవలను గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేగాక ఉద్యోగ భద్రత, పని గంటల సమయాన్ని తగ్గించాలని మిత్రలు కోరుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో గతంలో ఉన్న వ్యాధులకు గాను మరిన్ని వ్యాధులకు సంబంధించిన సేవలు పెంచారే తప్ప ఆరోగ్యమిత్రలను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆరోగ్యమిత్రలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

• సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ డీఎం

ఆరోగ్యమిత్రలు సమ్మెలో ఉండడంతో ఆస్పత్రుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సేవల్లో అంతరాయం కలిగిందని ఇప్పటి వరకు ఏ ఒక్క ఫిర్యాదు రాలేదు.

ఓటరు ముసాయిదాపై అభ్యంతరాలను తెలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

• కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 18: ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈనెల 21 వరకు గ్రామ కార్యదర్శులకు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ముసాయిదాను ఈనెల 13న ప్రకటించామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సమర్పించాలని వాటిని పరిశీలించి ఈనెల 26లోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. తుది ఫొటో ఎలక్టోరల్ జాబితాను ఈనెల 28న ఆయా గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురిస్తామన్నారు. ప్రస్తుత జాబితా సాఫ్ట్ కాపీలను రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో డీపీవో శ్రీనివాస్‌రావు, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు



మంజీరా నదిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, సెప్టెంబరు 18: మంజీరా నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, టీఎస్ ఎండీసీ రెవెన్యూ అధికారులతో కలిసి బీర్కూర్ మంజీరా నదికి విచ్చేశారు. ఇసుక క్వారీల నిర్వహణకు అనుమతులు ఇచ్చిన ప్రదేశాలు, నది ఒడ్డున డంపు చేసి ఉంచిన ఇసుక నిల్వలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఇసుక క్వారీల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. అయితే కొందరు వ్యక్తులు రాత్రి వేళలో మంజీరా నది నుంచి టిప్పర్‌లలో ఇసుక లోడ్ చేసి అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు కమిటీ ఏర్పాటు చేసి మంజీరా నదిలో ఇసుక తవ్వకాలు, ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేపట్టామన్నారు. పూర్తి విచారణ అనంతరం అందుకు సంబంధించిన రిపోర్టును కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గత కొన్ని రోజులుగా మంజీరా నది నుంచి రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా బిచ్కుంద, చెట్లూర్, హజ్గుల్, కుర్లా, కత్‌గావ్‌ల మీదుగా కొనసాగుతోంది. గత వారం రోజుల క్రితం అధికారులు మాటు వేసి అక్రమ రవాణా చేస్తున్న ఆరు ఇసుక టిప్పర్లను పట్టుకుని బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు స్వాధీన పరిచారు. అయినా ఇసుక దందా ఆగలేదు. ఇప్పుడైనా ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం పడుతుందో లేదో చూడాలి మరి. ఇసుక క్వారీల నిర్వాహకులు హద్దులు దాటి అనుమతికి మించి ఇసుక తవ్వకాలు జరిపారని, పలువురు రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు బావులు వట్టిపోయే ప్రమాదం ఉందని రైతులు అధికారుల ముందు వాపోయారు. వారి వెంట తహసీల్దార్ లత, డీఎస్పీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 18: బీబీపేట మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే బాలుర హాస్టల్‌లోని సమస్యలు పరిష్కరించాలని పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేరెంట్ కమిటీ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టళ్ల అన్ని కూడా కొత్తపుంతలు తొక్కుతాయని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి మూకుమ్మడిగా అద్దె భవనాల్లో రెసిడెన్షియల్ భవనాలు ప్రారంభించారని అన్నారు. బీబీపేటలో ఉన్న జ్యోతిబాపూలే పాఠశాలలో 430 మంది విద్యార్థులు ఉండగా సరైన మరుగుదొడ్లు, డోర్స్, కిటికీలు లేకుండా ఉండడంతో వర్షం పడినప్పుడల్లా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న అధికారులకు, ఆర్‌సీవోకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే విద్యార్థులను మరో భవనంలోకి మార్చాలని కోరుతున్నామన్నారు.

నిమిశాంబదేవి ఆలయానికి విరాళం



ముప్కాల్, సెప్టెంబరు 18: బాల్కొండలోని నిమి శాంబదేవి ఆలయానికి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం లింబాయి జ్ఞాపకార్థం వారి కుమారుడు పీఆర్.నర్సింగ్‌రావు బుధవారం ఆలయ నిర్వాహకులకు రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రానున్న నవరాత్రి ఉత్సవాల కోసం ఆలయానికి రంగులు వేసి, విద్యుత్‌దీపాలతో సిద్ధం చేసేందుకు ఉపయోగించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నర్సింగ్‌రావు ద్వితీయ కుమారుడు లింబేష్ నిమిశాంబదేవికి రూ.10వేల 400 విలువ గల 11తులాల మూడు గ్రాములు వెండితో చేయించిన కమలం పువ్వు హారాన్ని అందజేశారు. పురాతన ఆలయం కావడంతో పలువురు దాతలు ఆదుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ప్రతినెలా శుక్రవారం అన్నదానం నిర్వహిస్తున్నట్టు అయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండో అంతస్తు నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 18: నగరంలోని సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రెండో అంతస్తు నిర్మాణం కోసం చైర్మన్ రమేష్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కోటి రూపాయలతో నిర్మించే ఈ అంతస్తు కోసం ముందస్తుగా ఈ నిర్మాణానికి శిలాఫలకాన్ని వేశారు. బ్యాంకు కార్యకలాపాల కోసం ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బ్యాంక్ పాలకవర్గం సభ్యులు సంగ్రామ్ నాయక్, గిరిదావర్ గంగారెడ్డి, సాంతేశ్వర్‌పటేల్, ముస్కుల సాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శరత్, కె.శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్ పాటిల్, భూమన్న, లింగయ్య, మోతిలాల్, శంకర్, ఆనంద్, భూషన్‌రెడ్డి, యాదగిరితో పాటు బ్యాంక్ సీఈవో నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 18: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం వరి పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ వానకాలం సీజన్‌లో మహేంద్ర అండ్ మహేంద్ర ప్రైవేటు కంపెనీ సంస్థ మండలంలోని రైతులకు సుమారు 500ఎకరాలకు కంపెనీకి సంబంధించిన వరి విత్తనాలు ఇచ్చారు. రైతులు ఈ వరి పంటను సాగు చేస్తున్నారని, వారి ధన్యం గింజలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో రైతులు ఈనెల 16న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనంతరం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ జక్రాన్‌పల్లిలో మహేంద్ర అండ్ మహేంద్ర వరి విత్తనాలు ఇవ్వగా రైతు ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ వరి పంటకు ధాన్యం గింజలు రాకపోవడంతో అన్వేష్‌రెడ్డి ఈనెల 16 పరిశీలించారు. ఈ పంటను పరిశీలిస్తారని అన్వేష్‌రెడ్డి రైతులకు వివరించగా బుధవారం జక్రాన్‌పల్లిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి ధాన్యం గింజలు రాని వరి పంటను పరిశీలించారు. ఈ వరి పంటకు సుడిదోమ, కంకినల్లి వ్యాధులు ఆశించినట్టు గమనించినట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈసుడిదోమ, కంకినల్లి వ్యాధుల నివారణకు స్పైరోరిషిపిరన్, ప్రాఫికోనజోల్ కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్‌రూరల్ సహయ వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేష్‌కుమార్, ఆర్ఏఆర్ఎ జాగిత్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ గోనినాయక్, బలరాం, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, వ్యవసాయాధికారిణి దేవిక, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో స్వామివారి పల్లకీ సేవ

మెండోర, సెప్టెంబరు 18: మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర్ణమి రోజు పురస్కరించుకొని స్వామివారి ఉత్సవ మూర్తులను గోవింద నామాలతో ఆలయం చుట్టు ఊరేగించారు. పల్లకి సేవ ముందు మహిళలు మంగళహారతులతో భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఏర్గట్ల, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా అధికారులు పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా కరెంట్ బిల్లులకు సంబంధించిన వినతులు ఎక్కువగా రావడం జరిగిందని వాటి సమస్యను ఫీల్డ్ విజిట్ చేసి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ, రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, ఏఈ సురేష్, లైన్‌మెన్ నవీన్‌లు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: బాన్సువాడ నుంచి బోధన్ వస్తున్న బస్సులో ఉన్న ప్రయాణికులకు బుధవారం తృటిలో ప్రమాదం తప్పినట్లయింది. బాన్సువాడ నుండి బోధన్ వస్తున్న బస్సు పసుపు వాగు సమీపంలోకి రాగానే అజాగ్రత్తగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ పంట పొలాల వైపు బస్సును మళ్లించాడు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ ఆర్టీసీ బస్సును వెనక్కి తెప్పించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్పించారు. దీంతో ప్రయాణికులు హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,సెప్టెంబరు 18: పొతంగల్ మండల కేంద్రంలో మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం తహసీల్దార్ మల్లయ్య పట్టుకున్నారు. పొతంగల్ నుండి పొతంగల్ వైపు వెళ్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ట్రాక్టర్‌యాజమానులపై సీఆర్‌పీఎఫ్ 107కింద కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాన్స్‌పోర్టు, మైనింగ్ అధికారులకు సమాచారం ఇస్తామన్నారు. ట్రాక్టర్ యాజమానులు ట్రాక్టర్‌లను ఇసుక రవాణాకు వినియోగించరాదని సూచించారు.

గుండెపోటుతో యువకుడి మృతి..?

మాక్లూర్, సెప్టెంబరు18: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన మధు(27) అనే యువకుడు గుండెపోటుతో మరణించి ఉంటాడని ఎస్సై రాజశేఖర్ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు బుధవారం మానిక్‌బండార్ హిందు యువజన సేన గణేష్ మండలి వారి యొక్క గణేష్ విగ్రహం నిమజ్జనం తీసుకువెళ్లడానికి తన ట్రాక్టర్‌లో గణేష్ నిమజ్జనం చేశారు. తెల్లవారు జామున 3గంటల సమయంలో కావడంతో రామాలయం గుడి ఆవరణలో విశ్రాంతి తీసుకున్నాడు. ఉదయం 8గంటలకు గణేష్ యువజన సభ్యులు అతనిని నిద్ర లేపగా అప్పటికే మృతి చెందిన ఉన్నట్టు వారు గమనించారు. స్థానిక డాక్టర్ వచ్చి చూడగా మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు గుండెపోటుతో మరణించి ఉంటాడని, పోస్టుమార్టం నివేదిక వస్తే విషయం తెలుస్తోందని ఎస్సై రాజశేఖర్ తెలి పారు. మృతుని భార్య సంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వినాయక శోభాయాత్రలో చిన్నపాటి ఘర్షణ

నవీపేట,సెప్టెంబరు 18: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున వినాయక శోభాయాత్ర సందర్భంగా చిన్నపాటి గొడవ జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన వినాయక మండపానికి చెందిన యువకులు శోభాయాత్ర ద్వారా బాసరకు గణేష్ నిమజ్జనానికి వెళ్తున్నారు. స్థానిక మార్కండేయ ఆలయం సమీపంలోకి వచ్చిన శోభాయాత్రలో యువకులు నృత్యాలు చేస్తున్నారు. ఇదే సమయంలో తెల్లవారుజామున 3:30గంటల సమయంలో నిజామాబాద్‌కు చెందిన ముగ్గురు ట్రాన్స్‌జెండర్‌లతో పాటు మరో వ్యక్తి తమ వినాయకుడితో సహా యంచ గోదావరికి నిమజ్జనానికి తరలివెళ్తున్నారు. ఇదే సమయంలో యువకులతో కలిసి ట్రాన్స్‌జెండర్‌లు సైతం నృత్యంలో పాల్గొన్నారు.ఈ సమయంలో పలువురు యువకులు ట్రాన్స్‌జెండర్‌లతో అసభ్యంగా ప్రవర్తించడంతో ట్రాన్స్‌జెండర్‌లు, యువకులకు మధ్య గొడవ జరుగగా ట్రాన్స్‌జెండర్‌ల వెంట వచ్చిన వ్యక్తి తలకు గాయాలయ్యాయి. వెంటనే అతనిని స్థానికప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ట్రాన్స్‌జెండర్‌లు సైతం తమదుస్తులను సొంతంగా తొలగించుకోవడంతో అక్కడి నుండి యువకులు పరారీ అయ్యారని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య


మృతుడు గంగాధర్

ఎడపల్లి, సెప్టెంబరు18: తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది కుర్నాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మం డలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన గుత్పమాడ గంగాధర్ బ్రతుకు దెరువు కోసం నిజామాబాద్ వెళ్లి కసాబ్ గల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, అతడు తాగుడుకు బానిసై తరచూ ఇంట్లో గొడవ పడుతూ ఇంట్లో నుండి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడని, గత పది రోజుల క్రితం డబ్బుల విషయంలో ఇంట్లో గొడవ పడి కోపంతో ఇంటి నుంచి వెళ్లిన తను ఇంటికి రాలేదని, కుర్నాపల్లి గ్రామస్థులు గ్రామ చెరువు చాకలి రేవు దగ్గర పొదలో గంగాధర్ చనిపోయి పడి ఉన్నాడని గ్రామానికి చెందిన చాకలి సురేష్ ఆతని భార్య సావిత్రికి సమాచారం అందించడంతో కుర్నాపల్లి గ్రామానికి వచ్చి చూడగా తన భర్త నిజంగానే చనిపోయాడని తెలుసుకుని ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: ఆర్టీసీ అభివృద్ధికి ఆర్టీసీ డ్రైవర్‌లు, కండక్టర్‌లు, సిబ్బంది కృషి చేయాలని నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాని రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ ఆర్టీసీ డిపోలో త్రైమాసికంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులు తీసుకున్న వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా ఉద్యోగులు కూడా కష్టపడి పనిచేస్తూ అవార్డులు అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌లతో ఆర్టీసీ సిబ్బంది తదితరులున్నారు.

గ్రామాల వారీగా ఓటర్ల జాబితా తయారు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 18:జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాలలోని పోలింగ్ స్టేషన్ల వారిగా ఉన్న ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీల వారిగా, వార్డుల వారిగా తయారు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 27 మండలాల పరిధిలోని 545 గ్రామ పంచాయతీలలో 5020 వార్డుల యొక్క ఓటర్ల జాబితా టి-పోల్ సాఫ్ట్‌వేర్ నందు పొందుపర్చి 13 సెప్టెంబర్ రోజున ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాను అన్ని గ్రామ పంచాయతీలనందు వార్డుల వారిగా ప్రదర్శించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన కార్యచరణ ఆధారంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన బుధవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈనెల 14నుంచి 21 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని, 25వ తేదీ వరకు వాటిని పరిష్కరించి 28వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డుల వారిగా తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు.

'గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా హర్షణీయం'

సిరికొండ సెప్టెంబరు 18 :గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఎంతో మేలు చేస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బండారి నరేష్ అన్నారు. గల్ఫ్‌లో పనిచేస్తు మృత్యువత పడుతున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల నరేష్ హర్షం వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని నరేష్ ప్రభుత్వాన్ని కోరారు

ఇరువర్గాల మధ్య ఘర్షణ

డిచ్‌పల్లి... దోమకొండ, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని ఒకే కులానికి చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల వ్యక్తులకు గాయాలు కావడంతో వారితో పాటు ప్రభుత్వాసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు ఆసుపత్రికి చేరుకుని వారిని సముదాయించి పంపించారు. ఇరువర్గాల్లో రెండు పార్టీలకు చెందిన వ్యక్తులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు.

రెండో రోజూ సాగిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర


ఎడపల్లి గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


రుద్రూరులో ...


అర్గుల్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

ఎడపల్లి, సెప్టెంబర్18: ఎడపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు గణేష్ శోభయాత్రను శాంతియుతంగా జరుపుకున్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు బ్యాండ్ మేళాలతో, భాజా భజంత్రీలతో, నృత్యాలతో శోభయాత్రలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎడపల్లి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చెరువుల వద్ద చెరువు లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా ప్రజలను, భక్తులను అప్రమత్తం చేశారు. మండలంలోని చెరువులలో వినాయకులను నిమజ్జనం చేశారు. భక్తులు చెరువు లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నవీపేట: మండలంలోని యంచ గోదావరిలో రెండవ రోజైన బుధవారం వినాయక నిమజ్జనం కొనసాగింది. మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన వినాయక నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. బుధవారం సాయంత్రం వరకు 420 వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేయడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. బుధవారం అర్థరాత్రి వరకు వినాయక నిమజ్జనం కొనసాగే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బాసర వేద పాఠశాలకు చెందిన విద్యార్థులు వినాయక నిమజ్జనంలో పాల్గొన్న అధికారులు, ఇతర సిబ్బందికి కూల్‌డ్రింక్‌లు, స్నాక్‌ను అందజేశారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా ముగిసింది. మంగళవారం రాత్రి నుండి కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో నిమజ్జన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. తెల్లవారుజాము వరకు శోభాయాత్ర కొనసాగింది. బుధవారం ఉదయం ఆయా గ్రామాలలో చెరువులు, మంజీర నదిలో వినాయకులను నిమజ్జనం చేశారు.

రుద్రూరు: పదకొండు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. రుద్రూరు మండల కేంద్రలో 11 రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన భక్తులు చివరి రోజు మంగళవారం రాత్రి సందడిగా ఊరేగింపులు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో యువకులు నృత్యాలు చేయగా సార్వజనిక్, నవయుగ గణేష్ మండలిల ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో భజన కార్యక్రమాలు చేసుకుంటూ నిమజ్జనానికి వినాయకులను తరలించారు. గణేష్ మండపాల వారి బ్యాండ్ మేళాలు, డప్పు చప్పుళ్లతో మండల కేంద్రం మారుమోగింది.

● ప్రశాంతంగా శోభాయాత్ర....

రుద్రూరు మండల కేంద్రంలో వివిధ మండపాల వారి ఆధ్వర్యంలో గణేష్ శోభయాత్రను శాంతియుతంగా జరుపుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రుద్రూరు పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చెరువు వద్ద చెరువు లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా ప్రజలను, భక్తులను అప్రమత్తం చేశారు.గణేష్ మండపాల నిర్వాహకులు బ్యాండ్ మేళాలతో, భజా భజంత్రీలతో డ్యాన్సులతో శోభాయాత్రలో పాల్గొన్నారు.అదే విధంగా రుద్రూరు కేంద్రంలో చెరువులో పెద్ద ఎత్తున వినాయకులను నిమజ్జనం చేశారు. నిర్వాహకులు చెరువు లోకి వెళ్లకుండా ఒడ్డుపైనే పూజలు నిర్వహించి వినాయకులను గంగమ్మ ఒడిలోకి చేర్చారు.భక్తులు చెరువులోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

● రుద్రూరు జాతర ఉత్సవాల్లో ఆకట్టుకున్న భజన, భక్తి గీతాలు

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలో గణనాథులకు ఘనంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం రాత్రి నిర్వహించిన జాతర ఉత్సవాలలో భాగంగా శ్రీ సార్వజనిక్ గణేష్ మండలి కైలాష్ బృందం, నవయుగ గణేష్ మండలి శబరి సాయి భజన మండలిల ఆధ్వర్యంలో భజన, భక్తి గీతాలు, భరతనాట్యం వంటి ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వినాయక పూజలను చేసి జాగరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన భజన, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గణేష్ నిమజ్జనం రెండో రోజు బుధవారం కొనసాగింది. పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గణనాథులు శోభాయాత్ర యువకులు నృత్యాలు చేశారు. అదే విధంగా గూండ్ల చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కోసం భారీగా గణనాథులు విచ్చేశాయి. అలాగే పెర్కిట్, మామిడిపల్లిలో బుధవారం సాయంత్రం వరకు గణనాథులు శోభాయాత్ర కొనసాగగా డీజేలతో పోటాపోటీగా యువకులు డ్యాన్స్‌లు చేసూ గణేష్ నిమజ్జనం నిర్వహించారు. గణనాథుల నిమజ్జనానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వీక్షించారు.

● గణేష్ లడ్డు పొందిన భక్తుడు..

ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్‌లోని గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు ప్రసాదం లక్కీ డ్రాలో బోండ్ల ఆనంద్ లత లడ్డును దక్కించుకున్నారు. 11రోజుల పాటు పూజలందుకుని గణపతి చేతిలోని లడ్డు పొందడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లితో పాటు ఆలూర్ మండల కేంద్రం, వివిధ గ్రామాలలో భారీ గణపతులను రాత్రి మండపాల నుంచి కదిలించి భజనలు, నృత్యాలు చేస్తూ యువకులు డ్యాన్స్‌లతో నిమజ్జనానికి తరలించారు. రెండు రోజుల పాటు సాగిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ మంగళవారం నుంచి బుధవారం వరకు గణేష్ శోభాయాత్ర కొనసాగుతుంది. ఇప్పటికే గ్రామాల్లో గణేషులను నిమజ్జనం చేశారు. పౌర్ణమి ఉన్నందున బుధవారం వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం నిర్వహించారు. గణేష్ మండల సభ్యులు భక్తిశ్రద్ధలతో నిమజ్జన శోభ నిర్వహించి ఆనందోత్సవాల మధ్య ఉత్సవాలను జరుపుకున్నారు. అనంతరం స్థానిక చెరువులను గణనాథులను నిమజ్జనం చేశారు. ఆనందోత్సవాల మధ్య గణేష్ నిమజ్జనం జరుకున్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో గణపతి శోభాయాత్ర బుధవారం రోజు కొనసాగుతుంది. మంగళవారం సా యంత్రం నుంచి ప్రారంభమైన గణేష్ శోభయాత్ర బుధవారం వరకు కొనసాగుతుంది. గణేష్ శోభయాత్రలో యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ నిమజ్జనం నిర్వహించారు.

భీమ్‌గల్: మంగళవారం ప్రారంభమైన గణేష్ నిమజ్జన శోభయాత్ర బుధవారం వరకు సాగింది. పట్టణ కేంద్రంలోని వివిధ కాలనీలో గణనాథులు బెజ్జోర రోడ్డు నుంచి రాగులకుంటలో నిమజ్జనం చేశారు. నంది గల్లీలోని నందీశ్వర యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుడిని నిమజ్జన శోభయాత్రను పట్టణ ప్రజలు చూసేందుకు తరలివచ్చారు. గణేష్ శోభయాత్రలో ఏలాంటి వాంచనీయ సంఘటనలు జరుగకుండా సీఐ నవీన్‌కుమార్, ఎస్సై ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లితో పాటు ఆలూర్ మండల కేంద్రం, వివిధ గ్రామాలలో భారీ గణపతులను రాత్రి మండపాల నుంచి కదిలించి భజనలు, నృత్యాలు చేస్తూ యువకులు డ్యాన్స్‌లతో నిమజ్జనానికి తరలించారు. రెండు రోజుల పాటు సాగిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.

మెండోర: మండలంలో నవరాత్రులు పూజలు అందుకుని వినాయకులు గ్రామ సమీపంలో ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా మండలంలో గణేష్ మండపాల నిర్వాహకులు మెండోర, బుస్సాపూర్, పోచంపాడ్, కోడిచర్ల, దూదిగాం, వెల్కటూర్, సావెల్, దూదిగాం, సోన్‌పేట్, చాకిర్యాల్, వెల్కటూర్‌తాండా గణపతులను గ్రామవీదులగుండా బ్యాంచ్ మేళలతో ఊరేగించి నిమజ్జనం చేవారు. మెండోర మండలంలో పోలీస్‌సిబ్బంది ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై నారాయణ బందోబస్తు నిర్వహించారు.


భీమ్‌గల్‌లో నిమజ్జనానికి తరలిన నందీశ్వర యూత్ భారీ గణపతి


కిసాన్‌నగర్‌లో కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం దృశ్యం


యంచలో బోటింగ్ సిబ్బందికి కూల్‌డ్రింక్స్, స్నాక్స్‌ను అందజేస్తున్న విద్యార్థులు

రోడ్డు బాగైంది.. బస్సులు నడిపించండి..


భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్డును బాగు చేయించిన గ్రామస్థులు

సిరికొండ సెప్టెంబరు 18 : భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును కొండాపూర్, తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సంయుక్తంగా డబ్బులు వెచ్చించి బాగు చేయించారు. బస్సులు నడిపించాలి కమిటీల సభ్యులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.సిరికొండ మండలం కొండాపూర్ - రెడ్డిపేట్ తండాల మధ్య గల అడవీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురయ్యింది. దీని వల్ల గత పందోమ్మిది రోజులుగా కామారెడ్డి -సిరికొండ - భీమ్‌గల్ మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. కొండాపూర్ - తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీల సభ్యులు బుధవారం జేసీబీ, ట్రాక్టర్లతో వెళ్లి పాడై పోయిన రోడ్డును బాగు చేయించారు. కోతకు గురైన కల్వర్టు వద్ద మట్టిని నింపారు. రోడ్డు బాగు చేశారు. బస్సులు వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాల్సిన రోడ్డు భవనాల శాఖ అధికారులు ఈ రోడ్డు తమకేమి పట్టదన్నట్లు మిన్నకుండి పోయారు. కొండాపూర్, తూంపల్లి గ్రామాల ప్రజలు అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులు చేస్తామంటే రోడ్డు భవనాల శాఖ అధికారులు అడ్డుకోవడం వల్ల బస్సులు రాకపోఇవడం వల్ల పందోమ్మిది రోజులుగా ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. బుధవారం తూంపల్లి, కొండాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మూకుమ్మడిగా ట్రాక్టర్లు, జేసీబీతో వెళ్లి రోడ్డును బాగు చేయించారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇబ్బంది పడ్డ ప్రయాణికులు...కామారెడ్డి ప్రాంత రోడ్డు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యానికి తాము ఇబ్బంది పడ్డామని కొండూర్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీరడి శ్రీధర్ అన్నారు. తాము వారం పది రోజలు క్రితమే రోడ్డును బాగు చేయించే వారమని రోడ్డు భవనాల శాఖ అధికారులు అడ్డుకోవడం వల్లె 18 రోజులు ఆలస్యం జరగిందన్నారు.రోడ్డు మరమ్మతు పనులను రెండు గ్రామాల కమిటీ సభ్యులు పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు అబ్బాస్, కిరణ్,జగన్,రమేష్,రాంసింగ్,సాయిలు,రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పర్యవేక్షించారు.

గణేష్ నిమజ్జన ఊరేగింపులో పరస్పర దాడులు

మోర్తాడ్, సెప్టెంబరు18: మండల కేంద్రంలోని గణేష్ ఊరేగింపులో పలువురు పరస్పరదాడులు చేసుకున్నారు. మంగళవారం అర్థరాత్రి గణేష్ నిమజ్జన శోభయాత్రలో డీజేలచే ఊరేగింపు నిర్వహించారు. పోటాపోటీ జరిగిన ఊరేగింపులో చిన్నపాటి ఘర్షణ పెద్ద గా సంఘటనకు చోటు చేసుకుంది. ఈ ఘటన అర్థరాత్రి ఒంటి గంటకు ఊరేగింపు కొనసాగగా పలువురు యువకులు దాడులకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి డీజేలను సీజ్ చేసి గణపతి ఊరేగింపు సజావుగా సాగేలా చేశారు. నిమజ్జన ఊరేగింపులో కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి, భీమ్‌గల్ సీఐ నవీన్‌లు రాత్రిళ్లు బందోబస్తు నిర్వహించారు.

కాకతీయ కాలువలో యువకుడి గల్లంతు

మెండోర, సెప్టెంబరు18: మండల కేంద్రానికి చెందిన ద్యారంగుల చిన్న మల్లెన్న(32) మద్యానికి బానిసై కాకతీయ కాలువలో పడి గల్లంతైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మల్లెన్న మద్యానికి బానిసై గత కొన్ని రోజులుగా మద్యం తాగేవాడని తాగిన మత్తులో మెండోర గ్రామానికి అతి సమీపంలో కాకతీయ కాలువలో పడి గల్లంతు అయ్యాడని తెలిపారు. ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందగానే కాకతీయ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. మల్లెన్నకు భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదాచయలు అలుముకున్నాయి. మల్లె భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

ఎడపల్లి, సెప్టెంబర్ 18: గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలో ఉన్న చెత్తను ప్రతిరోజు తొలగించాని బోధన్ ఇన్‌చార్జి డీఎల్‌పీవో మధుకర్ అన్నారు. ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ పంచాయితీని బుదవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న పాఠశాలలో జరుగుతున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను, గ్రామంలో చేపడుతన్ను పారిశుధ్య పనులను పరిశీలించారు.

కత్తితో దాడి.. ఏడుతులాల బంగారు నగలు చోరీ


చికిత్స పొందుతున్న ధరావత్ మోహన్

నాగిరెడ్డిపేట, సెప్టెంబ రు 18 : గుర్తుతెలియని దుండగులు ధరావత్ మోహన్‌పైన కత్తితో దాడి చేసి అతన్ని తీవ్రంగా గాయ పరిచారు. దొంగతనానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి నాగిరెడ్డిపేట మండలంలోని బంజారా తండా గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన బాధితురాలు ధరావత్ నిర్మల తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బంజారా తండా గ్రామా నికి చెందిన ధరావత్ మోహన్ అతని భార్య ధరావత్ నిర్మల తమ కుమారునితో కలిసి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా, అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. దొంగతనానికి వచ్చిన దుండగులు ధరావత్ మోహన్, నిర్మలను తమ ఇంట్లో ఉన్న బంగారు నగలను చూపించాలని అడుగగా, వారు చూపించకపోవడంతో దుండగులు మోహన్‌పై కత్తితో దాడి చేశారు. మోహన్ మెడపై దుండగులు కత్తితో దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన మోహన్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దుండగులు మోహన్ భార్య మెడలో ఉన్న బంగారు పుస్తుల తాడుతో పాటు ఇంట్లోని బీరువాలో ఉన్న సుమారు ఏడు తులాల బంగారు నగలను దొంగిలించుకుపోయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీంద్రనాయక్, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌టీమ్‌ను డాగ్ స్క్వాడ్‌లను రప్పించి విచారణ చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన దుండగుల వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

నిఖత్ జరీన్‌కు డీఎస్పీ పోస్టింగ్


నియామక పత్రం అందజేస్తున్న డీజీపీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18: అంతర్జాతీయ బాక్సర్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం గత కొన్ని రోజుల క్రితం డీఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా జాయినింగ్ రిపోర్టును ఆమెకు అందజేశారు. నిఖత్ జరీన్ జాయినింగ్ రిపోర్టును డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్‌కు అందజేశారు. జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ రెండు సార్లు ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌గా గెలిచింది. కామన్‌వెల్త్ గేమ్స్‌లోనే బంగారు పతకం, ఆసియా క్రీడల్లో కాంస్య పతకాన్ని సాధిం చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకువస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన భవనంలోకి కేంద్రీయ విద్యాలయం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 18: బోధన్ పట్టణంలోని బెల్లాల్ ప్రాంతంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాన్ని బుధవారం పాండుఫారంలో నూతనంగా నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి తరగతులు, విద్యాబోధన ప్రారంభమైంది. ప్రస్తుతం 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇక్కడే విద్య బోధన జరుగుతుందని, ప్రస్తుతం బెల్లాల్ నుండి పాండుఫారం నూతన భవనంలోకి మార్చినట్లు అధికారులు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మొదటి తరగతిలో రెండో సెక్షన్‌తో పాటు 11వ తరగతి కూడా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

నవీపేట,సెప్టెంబరు 18: నిజామాబాద్ మండలం తిర్మన్‌పల్లికి చెందిన దేవనమైన పోశెట్టి(49)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. మంగళవారం ఉదయం తన సోదరుడైన డీ.పోశెట్టితో కలిసి బైక్‌పై మండలంలోని కోస్లీ గోదావరి సమీపంలో ఉన్న కుంటలో చేపలు పట్టడానికి వెళ్లారని గాలం నీటి కుంటలో తట్టుకోగా దానిని తీయడానికి యత్నించి దేవనమైన పోశెట్టి అందులో మునిగిపోయ్యాడని అన్నారు. మంగళవారం మృతదేహం కోసం గాలించినప్పటికీ లభ్యం కాలేదని బుధవారం అతని మృతదేహం బయట పడిందని అన్నారు. మృతుడి సోదరుడు డీ. పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

ఏర్గట్ల, సెప్టెంబరు 18: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలే కురిసిన వర్షాలకు దెబ్బతిన పసుపు పంటతో పాటు ఆయిల్ ఫామ్ పంటలను బుధవారం జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ బండారి శ్రీనివాస్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి వినాయక్ రైతులు బద్ధం ప్రభాకర్, కొట్టాల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌బస్సులో మంటలు

● డ్రైవర్, స్థానికుల అప్రమత్తతతో విద్యార్థులకు తప్పిన ప్రమాదం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 18: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇంది రానగర్ కాలనీలో బుధవారం ఉద యం విద్యార్థులను తరలిస్తున్న బ్రిలియంట్ పాఠశాలకు చెందిన బస్సులో మంటలు, పొగలు చెలరేగాయి. బస్సు ఇంజన్‌లోంచి మం టలు, పొగలు రావడంతో బస్సును డ్రైవర్ నిలిపివేశాడు. పొగకమ్ముకుంటుండడంతో విద్యార్థులు రోదించారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలు, డ్రైవర్ విద్యార్థులను హుటాహుటిన బస్సులో నుంచి కిందకు దించే ప్రయత్నం చేయడంతో పాటు మంటలు ఆర్పివేశారు. బస్సులోని బ్యాటరీలో స్పార్క్ రావడంతో మంటలు, పొగలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఏ మాత్రం మంటలు పెద్దగా వ్యాపించినా పెను ప్రమాదం సంభవించేదని, డ్రైవర్ అప్రమత్తతో బస్సును నిలిపివేయడంతో మంటలు, పొగలను అదుపులోకి తీసుకురావడంతో పాటు పిల్లలను వెనువెంటనే బస్సులోంచి దించివేశామని తెలిపారు. బస్సులో దాదాపు 25 మందికి పైగా విద్యార్థులున్నారు.


విద్యార్థులను దించివేయిస్తున్న స్థానికులు

ఎరువుల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలి

● డీఎల్‌పీవో శ్రీనివాస్


సిద్ధరామేశ్వరనగర్‌లోని కంపోస్ట్ షెడ్డు

భిక్కనూరు, సెప్టెంబరు 18: డంపింగ్‌యార్డులలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాల్లోని కంపోస్ట్ షెడ్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిగ్రామంలో రోజు తడి, పొడి చెత్తతో పాటుగా స్థానిక పాఠశాలలు, గురుకులలో కూర గాయల వేస్టేజీని సేకరించి సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగించాలన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజ్‌కిరణ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు దయాకర్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు

లింగంపేట, సెప్టెంబర్ 18 : మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని మండలపార్టీ అధ్యక్షుడు బుర్రనారాగౌడ్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండలంలోని ముంబాజీపేట, ముంబాజీపేటతండా, రాంపూర్, కొండాపూర్ గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని సమస్యలను కార్యకర్తల దృష్టికి తీసుకువస్తే సమస్యలను ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎల్లమయ్య, రామ్‌రెడ్డి, నగేష్, రామకృష్ణాగౌడ్, రఫీ, అట్టెం శ్రీను, అశోక్, రమేష్, పీర్‌సింగ్‌లతో పాటు తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు


మహారాష్ట్ర ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 18: రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఢిల్లీపై బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే తన్వీందర్‌సింగ్ చేసిన వివాదస్పద వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరమని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు,బ్లాక్ కాంగ్రెస్ గోనె శ్రీనివాస్, లక్ష్మన్ పాల్గొన్నారు.

మద్నూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై వివా దాస్పద వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఉమ్మడి మద్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేసి మహారాష్ట్ర ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. శివసేన ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు ఆధ్వర్యంలో ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు మహారాష్ట్ర ఎమ్మెల్యే వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని శివసేన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని కోరాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కొండ గంగాధర్, మాజీ సర్పంచ్ విఠల్ గురూజీ, మాజీ ఎంపీటీసీలు దీన్‌దయాల్ పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీందర్‌సింగ్ వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితరావుతో కలిసి పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 18 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణపతి బప్పామోరియా... మంగళమూర్తి మోరియా గణేష్ మహారాజ్‌కి జై అంటూ భక్తుల మిన్నంటే నినాదాలతో ఎల్లారెడ్డి పట్టణం మారు మోగింది. 11 రోజుల పాటు భక్తి భావనతో ఆధ్యాత్మిక సందడి చేసిన గణనాథులను నిమజ్జనోత్సవానికి తరలివెళ్లారు. ఈ నిమజ్జనోత్సవ పర్వం మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగి ఆడంబరంగా జరిగింది. గణేష్ విగ్రహాలను ఎల్లారెడ్డి పెద్ద చెరువు వద్ద గణపతుల నిమజ్జనానికి అధికారులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘనలు జరుగకుండా ఎల్లారెడ్డి మన్నే ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్‌కమిషనర్ శ్రీహరి రాజు, సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుం డా చర్యలు చేపట్టారు.

సదాశివనగర్ : మండలంలోని ఉత్తునూర్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. వివిధ కుల, యువజన సంఘాలు 11 రోజుల పాటు పూజలు నిర్వహించి బుధవారం డప్పుచప్పుల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సదాశివనగర్ ఎస్ఐ రంజిత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్‌రావు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు దొడ్లెరవి, వెంకట్‌రావు, రాములు, శివపాటిల్ తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

దోమకొండ : దోమకొండ మండల కేంద్రంతో పాటు బీబీపేటలో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. యువతి, యువకులు నృత్యాలు చేస్తూ నిమజ్జనం చేశారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా దోమకొండ, బీబీపేట ఎస్సైలు ఆంజనేయులు, ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చెరువుల వద్ద పోలీసులు వసతులు పరిశీలించారు. దోమకొండలో రాత్రి పాఠశాల 1వ నంబర్ గణేష్ వద్ద లడ్డూను రూ.20 వేల 50కి కూరచంద్రం వేలంపాటలో దక్కించుకున్నారు.

పాఠశాలలను సందర్శించిన నోడల్ అధికారి


చిన్నా ఆరేపల్లిలో పాఠశాలను తనిఖీ చేసిన నోడల్ అధికారి

నిజాంసాగర్, సెప్టెంబరు 18: నిజాంసాగర్ మండలం అచ్చంపేట కాంప్లెక్స్ పరిధిలోని చిన్నారేపల్లి, బ్రాహ్మణపల్లి, వెలగనూరు పాఠశాలలను నిజాంసాగర్ మండలం ఎడ్యుకేషన్ నోడల్ అధికారిపై తిరుపతిరెడ్డి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని బేస్‌లైన్ టెస్ట్, ఎఫ్ఏ వన్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా విద్యాబోధన అంశాల వారీగా పరిశీలించారు. విద్యార్థి లేక ప్రగతిని తరగతిల వారీగా పరిశీలించడం జరిగింది. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. పాఠ్య అంశాలకు అనుగుణంగా వర్క్‌బుక్‌లలో సాధన చేయించాలని సూచించారు. విద్యార్థులకు అక్షరాలు గుర్తుపట్టే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వంటకాలలో పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. వంట నిర్వహించే ప్రాంతాలలో శుభ్రంగా ఉం చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నారేపల్లి, బ్రహ్మణపల్లి, వెలగనూరు పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ధాన్యం లారీ పట్టివేత


బీర్కూర్‌లో గ్రామస్తులు పట్టుకున్న ధాన్యం లారీ ఇదే

బీర్కూర్, సెప్టెంబరు 18 : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ధాన్యం లారీని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బిచ్కుంద మండలం కుర్లెం గ్రామంలోని రైస్‌మిల్ వారు మంగళవారం రాత్రి లారీలో ధాన్యం బస్తాలు లోడ్‌చేసి బీర్కూర్ మీదుగా రవాణా చేస్తున్నారు. బీర్కూర్‌లో గ్రామస్తులు లారీని గమనించి ధాన్యం లారీని అడ్డగించారు. లారీలో రేషన్‌బియ్యం ఉన్నట్లు భావించారు. కాని అందులో వరిధాన్యం బస్తాలున్నాయి. ఎక్కడికి తరలిస్తున్నారని గ్రామస్తులు లారీడ్రైవర్‌ను ప్రశ్నించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు లేకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు విషయం చెప్పారు. అధికారులు అక్కడికి చేరుకుని ధాన్యం బస్తాలు పత్రాలు పరిశీలించారు. అనంతరం లారీని పోలీస్‌స్టేషన్‌కు స్వాధీనపరిచారు. వరి ధాన్యం బస్తాలు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు అనే వివరాలు అధికారులు వెల్లడించలేదు.

గ్యాస్‌సిలిండర్లు తూకం తగ్గాయని ఆందోళన


సిలిండర్ బుడ్డిలో నీరు వచ్చాయని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 18: వంట చేయడానికి విరివిగా ఉపయోగించే గ్యాస్‌బండలో గ్యాస్‌కు బదులుగా నీళ్ళు వచ్చాయని గ్రామస్తులు ఆగ్రహించారు. గ్యాస్‌ఏజెన్సీ నిర్వాహకులతో గొడవకు దిగిన ఘటన మండలంలోని విఠల్‌వాడీ తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా...... విఠల్‌వాడీ గ్రామానికి చెందిన సంతోషి కొద్దిరోజుల క్రితం జుక్కల్ మండలకేంద్రంలోని ఇండియన్ గ్యాస్‌ఏజెన్సీ ద్వారా జూన్ 19న సిలిండర్ బండను తీసుకున్నారు. అయితే ఈ సిలిండర్ బండ 14.2 కిలోల బరువు ఉండగా, బరువు ఎక్కువగా ఉందని వినియోగదారులకు అనుమానం వచ్చింది. దీంతో బుధవారం గ్రామానికి గ్యాస్‌ఏజెన్సీ వారు సిలిండర్ సరఫరాకు రాగా, గ్రామస్తులు వారితో గొడవకు దిగారు. దీంతో గ్రామానికి చేరుకున్న ఏజెన్సీ నిర్వాహకులు లారీలో వచ్చిన ప్రతి బండను తాము పరిశీలించామన్నారు. గ్యాస్‌బండలో నీరు వచ్చిన మాటవాస్తవమేనన్నారు. వినియోగదారులకు తిరిగి డబ్బులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కానివ్వమన్నారు.


ముత్యంపేటలో మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

'మహిళలు ఆర్థికంగా ఎదగాలి'

దోమకొండ, సెప్టెంబరు 18: స్వయం సహాయక సంఘంలోని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటిన్, కిరాణం, బట్టల దుకాణంను మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీపీఎంలు సుధాకర్, రమేష్‌బాబు, ఏపీఎం రాజు, సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమకొండలో శ్రమదానం

దోమకొండ, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని గడికోట వద్ద బుధవారం అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు శ్రమదానం చేశారు. చెత్తను తీసి డంపింగ్ యార్డులో వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరూవిధిగా చెత్తను బయట వేయకుండా చెత్తబుట్టలో వేయలన్నారు. బీబీపేట మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని పాఠశాలల్లో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, అనంత్‌రెడ్డి, సీతారాం మధు పాల్గొన్నారు.

మత్స్యకారుడి వలకు చిక్కిన కొండ చిలువ


చిక్కిన కొండ చిలువ

లింగంపేట, సెప్టెంబర్ 18 : మండలంలోని పొల్కంపేటకు చెందిన బొల్లారం సిద్దయ్య వలకు భారీ కొండచిలువ చిక్కింది. సిద్దయ్య రోజు మాదిరి లింగంపేట పెద్దవాగులో చేపలు పట్టేందుకు వలవేసి కొద్దిసేపటి తరువాత వలను తీయగా వలలో 15 అడుగుల కొండ చిలువ పడడంతో సిద్దయ్య భయాందోళనకు గురయ్యాడు. కొండచిలువను చంపివేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్యపరీక్షలు

రామారెడ్డి, సెప్టెంబరు 18 : మండల కేంద్రంతో పాటు పోసానిపేట్, ఇసన్నపల్లి గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు బుధవారం ప్రత్యేక వైద్యపరీక్షలను ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరం ఉన్న చిన్నారులకు రక్తపరీక్షలు చేయించి చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పద్మ, జ్యోతి,శోభ, అంగన్‌వాడి టీచర్లు జ్యోతి పాల్గొన్నారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన ఒకరి బైండోవర్

రాజంపేట, సెప్టెంబరు 18: రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన వ్యక్తిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. మద్యం మత్తులో డయల్ 100కు పలుమార్లు కాల్‌చేసి దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని తెలిపారు. అకారణంగా డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయవద్దని తెలిపారు.

కన్కల్‌లో పశువైద్య శిబిరం

తాడ్వాయి, సెప్టెంబరు 18: అధిక పాలను ఇచ్చే దూడలను రైతులు ఎంపిక చేసుకోవాలని డాక్టర్ ప్రొఫెసర్ రామచంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కన్కల్‌లో పశువైద్యశిబిరాన్ని నిర్వహించి మాట్లాడారు. 63 ఆవులకు చూడిపరీక్షలు నిర్వహించి 22 పశువులకు సాహివాల్ జాతి ఆవు లక్షణాలు కలిగిన పిండమార్పిడి ట్యూబ్‌బేబి ద్వారా దూడను పుట్టించడానికి సెలక్ట్ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు కిష్టారెడ్డి, మండల పశువైద్యాధికారి రమేష్, కామారెడ్డి మండల పశువైద్యాధికారి రవికిరణ్, శ్రీకొండల్‌రెడ్డి, సిబ్బంది మహిపాల్‌రెడ్డి, ఎల్ల య్య, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మద్నూర్, సెప్టెంబరు 18 : మద్నూర్ మాజీసర్పంచ్ వేద్‌ప్రకాష్ పటేల్ ను జుక్కల్ మాజీఎమ్మెల్యే హన్మంత్ షిండే పరామర్శించారు. కొన్ని రోజు లుగా మాజీసర్పంచ్ అనారోగ్యం బారిన పడటంతో బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు అనిల్ పటేల్, నగేష్ పటేల్, రాజు, రవి, మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు హన్మాండ్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రామారెడ్డి, సెప్టెంబరు 18 : మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన పందుల రాజేష్ చందు తల్లి అంజవ్వ వెన్నుముక సమస్యతో బాధపడుతోంది. రెండుసార్లు చికిత్స చేసుకున్నా కోలుకోలేక పూర్తిగా మంచానికే పరిమితమైంది. ఈ క్రమంలో తండ్రి పందుల రాజయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. పందుల రాజేష్ చందు రాత్రివేళలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. దీంతో బుధవారం గ్రామానికి చెందిన న్యూ ఫ్రెండ్స్ యూత్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో మిగిలిన మొత్తాన్ని మరికొంత జతచేస్తూ రూ.79 వేలు ఆ కుటుంబానికి అందించారు. అదే విధంగా త్రిశూల్ యూత్ వారు కూడా రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు.

చిన్నారులకు వైద్య సేవలు

రామారెడ్డి, సెప్టెంబరు 18 : గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం చిన్నారులకు వైద్యశిబిరం నిర్వహించారు. అన్నారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిని మానస చిన్నారులకు ఉచితంగా వైద్యపరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. రక్తశాతం తక్కువగా ఉన్న చిన్నారులకు రక్తపరీక్షల కోసం సెంటర్‌కి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలలను బాధ్యతాయుతంగా నడిపించాలి

● మండల ప్రత్యేకాధికారి


తరగతి గదులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

సదాశివనగర్, సెప్టెంబరు 18: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా బాధ్యతాయుతంగా నడిపించాలని మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ తెలిపారు. మండలంలోని యాచారం, సజ్జనాయక్ తండా, పూర్యనాయక్‌తండా, లక్ష్మీనాయక్‌తండాలలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్నభోజనాన్ని మెనూ ప్రకారం సక్రమంగా అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో పశువైద్య శిబిరం


బస్వాపూర్‌లో గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న దృశ్యం

భిక్కనూరు, సెప్టెంబరు 18 : మండలంలోని బస్వాపూర్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ దేవేందర్ దాదాపు 2వేల గొర్రె, మేకలకు పలు వ్యాధులకు చికిత్సలు నిర్వహించి వాటికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని అక్టోబర్ 3వరకు ప్రతి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

మద్నూర్, సెప్టెంబరు 18 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు కీ.శే. రమేష్ తమ్మేవారు ఈనెల 5న మృతిచెందారు. బుధవారం ఆయన దశదినకర్మను పురస్కరించుకుని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అల్లాపూర్‌శ్రీనివాస్, మండల కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కీర్తి శేషులు, రమేష్, తమ్మే వారు కుటుంబాన్ని పరామర్శించారు. ఉమ్మడి మద్నూర్ మండలానికి ఆదర్శ సేవా సమితి అధ్యక్షునిగా కీర్తిశేషులు రమేష్ తమ్మేవార్ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 18 : జడ్పీహెచ్ఎస్ తిరుమలాపూర్ క్యాంప్ నుంచి బదిలీపై వెళ్లిన పాధ్యాయులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు సన్మానం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి పి.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రేడియనాయక్, సంగీత, పోతన్న, కళావతి, సాయిలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు దూప్య, పుష్పలత, శిరీషాలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల కమిటీ సమావేశం

రాజంపేట, సెప్టెంబరు 18: మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఎల్లారెడ్డిపల్లి, ఎల్లాపూర్‌తండా, ఎల్లారెడ్డి పల్లి తండా గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సల్మాన్, జిల్లా ఎస్‌టీ సెల్ ఉపాధ్యక్షుడు వినోద్, డివిజన్ అధ్యక్షుడు మదన్‌లాల్, మండల సీనియర్ ఉపాధ్యక్షుడు శ్యామయ్య, ఉపాధ్యక్షులు శ్రీధర్, బన్సీలాల్, జనరల్ సెక్రటరీ సంతోష్‌రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బీరయ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 18 : ఎల్లారెడ్డిలో బుధవారం ఆర్డీవో మన్నే ప్రభాకర్ అధ్యక్షతన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం జరిగింది. 18 ఏళ్ళు నిండిన యువత తమ ఓటు హక్కునమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటును చెక్ చేసుకోవాలని ఆర్డీవో కోరారు. మార్పులు, చేర్పులు ఉంటే తహసీల్దార్ ఆఫీస్‌లో ఫామ్ నింపిస్తే చేస్తారన్నారు. సమావేశంలో ఎంఐఎం మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, బీజేపీ మండల, అధ్యక్షులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	- సరిపోదా శనివారం	మహేశ్వరి	- మత్తు వదలరా 2
దర్శన్	- ఏఆర్‌ఎమ్	వెంకటేశ్వర	- శంకర్‌దాదా ఎంబీబీఎస్
ప్రియా 35	- మత్తు వదలరా-2		

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

